క్లుప్తంగా

రుణమాఫీ చేయండి..



ఆందోళన చేస్తున్న ఎన్డీ నాయకులు

ఇల్లెందు: ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని, రైతులకు జూన్‌లో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని, వ్యవసాయ రుణాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యదళ్లపల్లి సత్యం డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందు తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... తడిచిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని, సబ్సిడీ మీద ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోకాళ్ల రమేష్, జే.సీతారామయ్య, ఎండీ రాసుద్దీన్, బయ్యా శారద, మోకాళ్ల సుగుణ, ఎల్.రవి, శ్రీను, వీరయ్య పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరిపించాలి


మాట్లాడుతున్న యశ్వంత్

జూలూరుపాడు: భద్రాచలం మారుతి నర్సింగ్ కళాశాల విద్యార్థిని మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి జమ్మి యశ్వంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, టీచింగ్ ఫ్యాకల్టీ లేదని, అధిక ఫీజు వసూలు, నిర్వాహణ వంటి అంశాలపై విచారణ చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థిని మృతికి బాధ్యులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బి.సైదు, బి.తరుణ్, డి.గణేష్, బి.అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు



చేతికందే ఎత్తులో ఉన్న తీగలను చూపుతున్న రైతు

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామపంచాయతీ పంట చేలల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు ఒక వైపుగా ఒరిగిపోయాయి. విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులోకి వచ్చాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రైతులు చేలల్లో పనులు ప్రారంభించారు. చేలల్లో ప్రమాదకరంగా ఒరిగిన స్తంభాలు, చేతికందే ఎత్తులో ఉన్న తీగల వలన ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు తక్షణం స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాలను, చేతికందే ఎత్తులో ఉన్న తీగలను సరిచేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

ఉత్కంఠ భరితం..!

- ఎవరు గెలుస్తారు.. ఎంత మెజారిటీ?!
- ఎక్కడ విన్నా ఎన్నికల ఫలితాలపై ముచ్చట్లే..
- పల్లెల్లో రక్తికట్టిస్తున్న రాజకీయ కబుర్లు
- నిద్ర కరువైన చోటా నాయకులు





ఇల్లెందురూరల్: సార్వత్రిక ఎన్నికలతోపాటు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంతో నేతలు బిజీబిజీగా గడపగా.. ఇప్పుడు ప్రజల్లో జయాపజయాలపై చర్చ మొదలైంది. ఏ నలుగురు ఒక చోటకు చేరినా ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి. ఎక్కడ ఎవరు గెలుస్తారు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపెవరిది వంటి విషయాలపైనే చర్చ జరుగుతోంది. కొందరు సమాచారం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుండగా.. మరికొందరు తమకు తోచిన విధంగా ఫలితాలను అంచనా వేస్తున్నారు.

ప్రముఖుల పోటీపైనే ఆసక్తి..

రాష్ట్రంలో పలువురు రాజకీయ ప్రముఖులు పోటీ చేస్తున్న నియోజకవర్గాలపై ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. పార్టీల కంటే అభ్యర్థుల సాధించే విజయాలపైనే ప్రధానంగా ఆరా తీస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి ఇతర నియోజకవర్గాల్లో పర్యటించి వచ్చిన నాయకులను కలిసి ప్రచారం తీరు, ఫలితాలు ఎలా ఉంటాయో తెలుసుకుంటున్నారు. ఇక ఫలానా నియోజకర్గంలో డబ్బే ఎన్నికలను శాసించాయని ఒకరు.. ప్రచారంలోని వ్యాఖ్యలే కీలకమని ఇంకొందరు చెబుతున్నారు.

గతం.. ప్రస్తుతంపై భిన్నాభిప్రాయాలు..

రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై ఏ మేరకు ప్రభావం చూపుతాయి. నేతల కప్పగంతులు ఏ పార్టీకి లబ్ధి చేకూరుస్తాయి. కండువా మార్చిన అభ్యర్థుల భవితవ్యం ఎలా ఉంటుందన్న అంశాలపై ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. పోటీ చేసిన అభ్యర్థుల ప్రచారం.. నేతల పార్టీల మార్పు.. ఎన్నికల్లో ధన ప్రవాహం.. నేతల ప్రచారం వంటి అంశాలను సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. రాష్ట్రంలో అధికార పార్టీకి లబ్ధిచేకూరుతుందని కొందరు.. లేదు.. లేదు.. ప్రతిపక్షం అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని మరికొందరు వాదనకు దిగుతున్నారు. దీనిపై పల్లెల్లో చిన్నపాటి గొడవలు కూడా జరుగుతున్నాయి. ఎవరికి తోచిన రీతిలో వారు విశ్లేషణలు చేస్తూ రచ్చబండలను రక్తి కట్టిస్తున్నారు.

పట్టభద్రుల ఆలోచన ఎలా ఉంది..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో అలసిపోయిన నేతలకు ఆ వెంటనే వచ్చిన ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సవాల్‌గా మారిందన్న చర్చ జరుగుతోంది. పోలింగ్ రోజున ఓటు వేసేందుకు పట్టభద్రులు ఆలస్యంగా రావడంపై ఆసక్తికర వ్యాఖ్యలు వినవస్తున్నాయి. పార్టీల ప్రలోభాల కోసం ఎదురుచూసి ఉంటారని కొందరు చెబుతుండగా.. దూర ప్రాంతాల నుంచి రావడంతోనే ఆలస్యమైందని మరికొందరు విశ్లేషిస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వ కార్యాలయాలు మొదలు.. హోటళ్లు, గ్రామాల్లో రచ్చబండల వద్ద ఎక్కడ నలుగురు గుమిగూడినా అటు లోక్‌సభ, ఇటు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల చర్చ మాత్రం తప్పక ప్రస్తావనకు వస్తోంది.

ఆంధ్రాపై మరింత ఆసక్తి.....

పార్లమెంట్ ఎన్నికల కంటే దేశంలోనే హోరాహోరీగా జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రజలు మరింత ఆసక్తి కనబరుస్తున్నారు. గడిచిన ఐదేళ్లుగా సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను గుర్తుచేసుకుంటూ జనం అతనికే జై కొట్టి ఉంటారన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు ఆంధ్రప్రదేశ్‌లో నివాసం ఉంటున్న తమ బంధువులు, స్నేహితులతో చర్చించి ఫలితాలపై ఆరా తీస్తున్నారు.

సీఎంగా జగన్ మరోసారి గద్దెనెక్కడం గ్యారెంటీ అని పేర్కొంటూనే మెజారిటీ మూడెంకల సంఖ్యలో ఎక్కడ ఆగుతుందోనన్న ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రతిపక్షం ముఖ్య నేతల్లో ఎవరి పరిస్థితి ఎలా ఉంటుందన్న చర్చను చలోక్తులతో కొనసాగిస్తూ హాస్యాన్ని పండిస్తున్నారు. కొంతమంది చోటా నాయకులకైతే నిద్రే కరువైందంటున్నారు. నాలుగో తేదీ కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. మరో ఐదురోజులను ఐదు యుగాలుగా గడుపుతున్నారు.

నేడు శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

ఇల్లెందు: ఇల్లెందు – కారేపల్లి మండలాల సరిహద్దు గ్రామం తొడిదెలగూడెం గ్రామం వద్ద 132 ఏళ్ల క్రితం వెలిసిన శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో ఏటా కల్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వైశాఖ మాస బహుళ సప్తమీ నాడు దేవతామూర్తుల కల్యాణం ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ జాతర సందర్భంగా ఇటు ఇల్లెందు మండలంలోని పలు గ్రామాల నుంచి అటు కారేపల్లి మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి కల్యాణ వైభవం తిలకిస్తారు. ఈ సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామానికి సమీపంలో పంట చేల మధ్య వెలిసిన ఈ ఆలయానికి నిర్వాహకులు పదేళ్లుగా గోపురాలు, మండపాలు, ప్రహరీ, ఆర్చిలు, మంచినీటి వసతి సదుపాయాలు కల్పించారు. కల్యాణం కోసం ఆలయం ముస్తాబైంది. రంగులద్ది పచ్చటి చలువ పందిళ్లు, తోరణాలతో అలంకరించారు. కల్యాణ మండపాన్ని నిర్మించారు. కల్యాణం సందర్భంగా రెండు మండలాలు – రెండు జిల్లాల సరిహద్దులో ఉన్నందున ఇటు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య, అటు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌లు హాజరు కాను నిర్వాహకులు బన్సీలాల్, రాజు తెలిపారు.

సీఎస్‌ఐ చర్చి ప్రారంభం


మాట్లాడుతున్న బిషప్ పద్మారావు

జూలూరుపాడు: జూలూరుపాడు న్యూకాలనీలో నూతనంగా నిర్మించిన సీఎస్‌ఐ చర్చి(క్రీస్తు దేవాలయం)ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. బిషప్ కె.పద్మారావు, రెవరెండ్ విజయకుమారి దంపతులు దేవాలయాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ.. ప్రజలు శాంతియుత మార్గంలో నడవాలన్నారు. పాస్ట్రేట్ చైర్మన్ సామ్యేలు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జి.అబ్రహం, రాంబాబు, దేవసహాయం, కాంతారావు, కె.కిరణ్, బి.ప్రభాకర్, మాణిక్యం, మేరీ రాంబాయి, జె.అబ్రహం, సేనంరాజు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించండి..


మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలలో నేటివరకు మరుగుదొడ్లు నిర్మించుకోని ఇళ్లను గుర్తించి నివేదిక అందజేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శులతో బుధవారం అయన సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ.. గతంలో ఏ ఇతర ప్రభుత్వ పథకాలలో మరుగుదొడ్లు మంజూరు కాని ఇళ్లను మాత్రమే గుర్తించి ఆన్‌లైన్ చేయాలని సూచించారు. గ్రామాలలో ప్రస్తుతం వేగవంతంగా సాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణాల తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తాగునీటి పైపులైన్లలో లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాకాలంలో నీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు తాగునీటి వ్యవస్థపై పరిశీలన కొనసాగించాలని, వర్షాకాలం ప్రారంభమవుతున్నందున మురుగుకాల్వ వ్యవస్థను బాగు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతీ గ్రామపంచాయతీ నుంచి 150 మంది కూలీలు పనికి హాజరయ్యేలా చేడాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ శంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కొత్తగూడెంటౌన్: చుంచుపల్లి విద్యానగర్ కాలనీలోని శక్తి సదన్ కేంద్రంలోకి ప్రవేశించేందుకు యత్నించిన యువకుడిపై బుధవారం చుంచుపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి చంద్రుగొండకు చెందిన ఊకే గణేష్ శక్తి సదన్‌లోకి ప్రవేశించేందుకు యత్నించాడు. గుర్తించిన స్థానికులు శక్తి సదన్ ఇన్‌చార్జ్ ప్రభావతికి సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేడుకలు విజయవంతం చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. బుధవారం ఇల్లెందులోని జీఎం కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. వచ్చే ఆదివారం సాయంత్రం 6 గంటలకు సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించే వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్తమ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాలు, వేడుకలలో సింగరేణి సేవా సభ్యులు, స్థానిక మహిళలతో తెలంగాణ రుచులు, తినుబండారాల స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ వేడుకలను సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, పట్టణ ప్రముఖులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూజీఎం మల్లారపు మల్లయ్య, జేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, ఐఈడీ ఇంజనీర్ గిరిధర్‌రావు, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం సర్వే బాలాజీనాయుడు, అధికారులు ధనుంజరెడ్డి, క్రిష్టఫర్, యూసఫ్, మహేష్, అంజిరెడ్డి, పవన్‌కుమార్, నాగేశ్వరరావు, కృష్ణ, సుధాకర్, సాయి స్వరూప్, సందీప్ పాల్గొన్నారు.

ప్రాతినిధ్య సంఘాలను పిలవడం తగదు

సింగరేణి(కొత్తగూడెం): జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దశ వార్షికోత్సవం సందర్భంగా సింగరేణి యాజమాన్యం నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాలకు గుర్తింపు పత్రం ఇవ్వకుండానే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను పిలవటం సరికాదని దీనిని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తోందని, ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి నేటికి ఐదు నెలలు అయిందని, ఇంకా గుర్తింపు పత్రం ఇవ్వలేదని, ఎన్నికల నిబంధనలకు ఇది పూర్తిగా విరుద్ధమన్నారు. గుర్తింపు పత్రం ఇవ్వకుండా అనేక అధికారిక కార్యక్రమాల్లో సింగరేణి యాజమాన్యం గుర్తింపు సంఘాలుగా మైన్స్ లెవల్ నుంచి కార్పొరేట్ ఉన్నత స్థాయి వరకు అధికారిక కార్యక్రమాలకు పిలుస్తోందని ఇది ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమేనన్నారు. ఒకవేళ ఇది సరైందేనని సింగరేణి యాజమాన్యం భావిస్తే సింగరేణి ఎన్నికలు నిర్వహించిన రోజు నుంచి గుర్తింపు కాలపరిమితిని పరిగణనలోకి తీసుకోవాలని అలా కాకుండా గుర్తింపు పత్రం ఇచ్చిన నాటి నుంచి కాలపరిమితిని లెక్కించటం మానుకోవాలన్నారు. గతంలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగియగానే అన్ని సంఘాలను సమానంగా చూడాలని డిమాండ్ చేసిన సంఘాలే నేడు దానికి విరుద్ధంగా వ్యవహరించటం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం గుర్తింపు పత్రం ఇచ్చేంతవరకు అన్ని సంఘాలను సమానంగా చూడాలని డిమాండ్ చేశారు.

అమరవీరుల స్తూపం ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ఆవిర్భావ 10వ వార్షికోత్సవం సందర్భంగా సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట అమరవీరుల స్తూపం ఏర్పాటు చేయాలని, ప్రతీ సింగరేణి కార్మికుడికి స్వీట్ ప్యాకెట్ పంపిణీ చేయాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు సింగరేణి సీఎండీని కోరారు. బుధవారం స్థానిక అసోసియేషన్ కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలి, మలిదశ ఉద్యమంలో ఎందరో విద్యార్థులు, తెలంగాణ వాదులు ఆత్మబలిదానం చేశారని, రాష్ట్ర సాధనకు వారు చేసిన సేవలను స్మరించుకునేందుకు అమరవీరుల స్తూపాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయమై తాము గతంలో కార్పొరేట్ వెల్ఫేర్ జీఎంకు పలుమార్లు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. సింగరేణిలో ఆంధ్రా అధికారులు తెలంగాణ వాదాన్ని అణగదొక్కేందుకు కుట్రలో భాగంగా ఆ విషయాన్ని పక్కన పడేశారన్నారు. రానున్న 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల సాధనకు సింగరేణి యాజమాన్యం అన్ని రకాల కసరత్తు చేపట్టటమే కాకుండా సింగరేణి వ్యాప్తంగా వర్క్‌షాపులు ఏర్పాటు చేసి లక్ష్యసాధనలో సీఎండీ అందరినీ భాగస్వామ్యం చేస్తున్నారు. ఈసారి కూడా కంపెనీ నిర్దేశించుకున్న వార్షిక లక్ష్యాలను సాధించి రూ.40 వేల కోట్ల టర్నోవర్ దిశగా అడుగులు వేస్తోందన్నారు. సంస్థలో పనిచేసే అన్నివర్గాలను ఒకే విధంగా చూస్తూ, వివిధ వర్గాల వారికి లైజన్ ఆఫీసర్లను నియమించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీ రావు, జిమ్మిడి మల్లేష్, పి.అంకుష్, విజేందర్, కాజీపేట కృష్ణ, శనిగరపు కుమారస్వామి, రాజేష్, మోరే రమేష్, చక్రపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 1న సర్వసభ్య సమావేశం

టేకులపల్లి: టేకులపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ 1న ఉదయం 10:30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బానోతు మౌనిక అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలు, గత సమావేశంలో వచ్చిన సమస్యలకు పరిష్కారం, సమాధానాలతో సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ నెల 24న నూతన ఎంపీపీగా బానోతు మౌనిక ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఆమె ఎన్నికైన తరువాత తొలి సమావేశం జరగనుండటం గమనార్హం.

అద్దె భవనాల్లోనే జీపీ కార్యాలయాలు

- ఏడాదిన్నరైనా పూర్తికాని నిర్మాణ పనులు
- నాలుగు చోట్ల వివిధ దశల్లో.. మరో ఏడు చోట్ల కుదరని ముహూర్తం



నల్లబండబోడులో పిల్లర్ల దశలో భవన నిర్మాణం, చెట్ల కింద కార్యకలాపాలు కొనసాగిస్తున్న సెక్రటరీ


శంభునిగూడెంలో స్లాబ్ వరకు..

జూలూరుపాడు: ఆరేళ్ల క్రితం నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలు ఇంకా అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గతంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో మరో 12 గ్రామ పంచాయతీలను నూతనంగా ఏర్పాటు చేయడంతో మొత్తం 24 గ్రామ పంచాయతీలు అయ్యాయి. 13 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు ఉండగా 11 పంచాయతీలు అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేక పాలకవర్గాలు, ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనాలు లేని జీపీలకు నూతన భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. ఒక్కో జీపీ భవన నిర్మాణం కోసం రూ.20 లక్షల చొప్పున ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. కొత్తూరు, గుండ్లరేవు, భోజ్యాతండా, సురారం, శంభునిగూడెం, గాంధీనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాలకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు, నల్లబండబోడు, చింతలతండా, సాయిరాంతండా, వెంగన్నపాలెం, గురువాగుతండా జీపీ భవనాలకు ఎస్టీఎస్‌డీఎఫ్(ఐటీడీఏ) నిధులు కేటాయించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ, ఐటీడీఏ పనులకు సంబంధితశాఖ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షించాల్సి ఉంది. కొత్తూరు, గుండ్లరేవు, నల్లబండబోడు, శంభునిగూడెం జీపీ భవనాల నిర్మాణ పనులు ప్రారంభించారు. గుండ్లరేవు, కొత్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణాలు తుదిదశకు చేరుకోగా, శంభునిగూడెంలో స్లాబ్ పూర్తి కాగా, నల్లబండబోడులో పిల్లర్ల దశలోనే పనులు నిలిచి ఏడు నెలలు అయింది. మిగతా ఏడు చోట్ల జీపీ భవనాల నిర్మాణ పనులకు మూహూర్తమే కుదరలేదు. ఇక భోజ్యాతండా, సురారం, గాంధీనగర్, చింతలతండా, సాయిరాంతండా, వెంగన్నపాలెం, గురువాగుతండా గ్రామ పంచాయతీ భవనాలు పనులు ఎప్పుడు ప్రారంభం అవుతాయో ఆకాశరామన్నకే తెలియాలి. స్థలాలు, పలురకాల సమస్యలు, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం, సర్పంచ్‌ల పదవీకాలం ఈ ఏడాది జనవరితో ముగియడంతో వీటిని పట్టించుకునేవారే కరువయ్యారు. జీపీ భవనాల నిర్మాణాలు ప్రారంభమైన చోట సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనుల్లో ఎడతెగని జాప్యం జరుగుతుండటంతో ఎప్పటికీ పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఏర్పడగా, పనులు ప్రారంభమే కాని జీపీల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు మరో రెండు నెలల లోపు ఎన్నికల జరగనున్నాయి. నూతన పాలకవర్గాల కొలువుదీరే నాటికైనా జీపీ భవనాలు అందుబాటులోకి వచ్చే అవకాశం కన్పించడం లేదు.

విధి నిర్వహణలో ఇక్కట్లు...

జీపీలకు సొంత భవనాలు లేక .. అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాల భవనాలు సరిపోక పాలకవర్గాలు, ఉద్యోగులు, సిబ్బంది కార్యకలాపాలకు ఇబ్బందికరంగా ఉంది. 2018లో ఏర్పడిన 12 గ్రామ పంచాయతీల్లో అన్నారుపాడు జీపీ కార్యాలయానికి ఏడాది క్రితం నూతన భవనాన్ని నిర్మించారు. మిగిలిన 11 జీపీలు అద్దె భవనాలు, పాఠశాల భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో భోజ్యాతండా, గుండ్లరేవు, పాఠశాల భవనాల్లో నల్లబండబోడు, చింతలతండా, గురువాగుతండా, శంభునిగూడెం, సాయిరాంతండా, గాంధీనగర్, కొత్తూరు జీపీలు కొనసాగుతుండగా, జూలూరుపాడు ఇరిగేషన్ కార్యాలయంలో వెంగన్నపాలెం, సురారం గ్రామస్తులు కొనుగోలు చేసిన రేకుల ఇంట్లో జీపీ కార్యాలయం కొనసాగుతోంది. నల్లబండబోడులో చెట్ల కింద ఉద్యోగులు కార్యకలాపాలు కొనసాగించాల్సిన దయనీయ పరిస్థితి. పాలకవర్గ సమావేశాల నిర్వాహణ భారంగా మారడంతోపాటు, గ్రామసభల నిర్వహణ కూడా కష్టంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీపీ భవనాల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణాలు జరుగుతున్నాయి



కొత్తూరు, గుండ్లరేవు జీపీ భవనాల నిర్మాణ పనులు తుది దశలో ఉండగా, శంభునిగూడెం జీపీ భవనం స్లాబ్ పూర్తి కాగా, మిగిలిన పనులు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల స్థల సమస్యతోపాటు, కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. త్వరలో అన్ని భవనాల పనులు ప్రారంభిస్తాం.

– జి.నాగేందర్, పంచాయతీరాజ్ ఏఈ,

చర్యలు తీసుకుంటాం..



కొత్తూరు, గుండ్లరేవు జీపీ భవనాల పనులు తుది దశలో ఉండగా, శంభునిగూడెంలో స్లాబ్ పూర్తి కాగా గోడల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నల్లబండబోడులో పిల్లర్ల స్థాయిలో ఉంది. ఒకటి, రెండుచోట్ల సమస్యలు ఉన్నాయి. సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటాం.

– తోట తులసీరామ్, ఎంపీఓ, జూలూరుపాడు

కాచనపల్లి అమరులకు ఘన నివాళి



టేకులపల్లి: అమరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు


ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న ఎన్డీ నాయకులు

టేకులపల్లి: కాచనపల్లి ఎన్‌కౌంటర్ జరిగి 33 ఏళ్లు అవుతున్నా... అమరులు నేటికీ ఎర్ర జెండాలో కదులుతూనే కనిపిస్తున్నారని, అమరుల త్యాగాలు వృథా కావని సీపీఐ(ఎంఎల్) ఖమ్మం, వరంగల్ జిల్లాల ఏరియా నాయకుడు జడ సీతారామయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం కాచనపల్లి అమరుల 33వ వర్ధంతి, సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కాచనపల్లి అమరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు. మాట్లాడుతూ... కాచనపల్లిలో ప్రజా ఉద్యమ నాయకులు నంబూరి సీతారామారావు, నోముల పరశురాములు, చింతా లక్ష్మి సూసేనలతో పాటు ప్రతిఘటన పోరాట నాయకుడు కోటన్నను 1991 మే 29న కాల్చి చంపి బూటకపు ఎన్‌కౌంటర్ కథనం అల్లిందని విమర్శించారు. దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసం అమరులు కలలుగన్న నూతన ప్రజాస్వామిక విప్లవం సాధన కోసం మరిన్ని పోరాటాలను నిర్మించాలని అదే వారికి నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా హర్ష్య, పి.వై.ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్, భూక్యా నర్సింగ్, బోడ మంచా, ధరావత్ భీక్యా, తోటకూరి సతీష్, గుగుతోతు నాగేశ్వరరావు, మాలోత్ వసంతరావు, చందర్, వెంకన్న, జాను, మంగీలాల్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం రక్తతర్పణం చేసిన కాచనపల్లి అమరుల ఆశయ సాధనలో అంకితమవుదామని న్యూడెమోక్రసీ ఖమ్మం, వరంగల్ జిల్లాల ఏరియా నాయకుడు జె.సీతారామయ్య పిలుపునిచ్చారు.

మండలంలోని కొల్లాపురం గ్రామంలో కాచనపల్లి అమరుల 33వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యం బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తుందనడానికి కాచనపల్లి, గొందిగూడెం ఎన్‌కౌంటర్లే సాక్ష్యమని గుర్తుచేశారు.

కాచనపల్లి ఘటనలో న్యూడెమోక్రసీ నేతలను చిత్రహింసలు పెట్టి చంపారని వాపోయారు. విముక్తి పోరులో ప్రజలందరినీ భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందన్నారు. అమరుల ఆశయ సాధనలో పయనించడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో మోకాళ్ల రమేష్, నాగేశ్వరరావు, మోకాళ్ల సుగుణ, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.